నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 హైదరాబాద్, గురువారం 28 మార్చి 2024 VIKARABAD

# బీఆర్‌ఎస్‌తోనే బహుజనులకు న్యాయం

**ఆర్‌ఎస్‌పీ నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కల్వకుర్తి నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు**



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కల్వకుర్తి బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు బండగల్ల చందు

ఆమనగల్లు, మార్చి 27 : బీఆర్‌ఎస్‌తోనే బహుజనులకు న్యాయం జరుగుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆర్‌ఎస్‌పీ నివాసంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు బండగల్ల చందు ఆధ్వర్యంలో బీఎస్పీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరగా, ఆర్‌ఎస్పీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమన్నారు. బహుజనవాదం తెలంగాణ వాదం ఒకటే అని అన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగానే మారుస్తుందని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నదని, ఇలాంటి చర్యలకు పాల్పడడం అటు మోదీ ప్రభుత్వానికి ఇటు తెలంగాణ ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం వారి మాటలు వినని నాయకులపై ఈడీ , సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డంపెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో అసెంబ్లీ అడ్వైజర్ కొమ్ముకిరణ్, వెల్దండ, మాడ్గుల మండలాల ఇన్‌చార్జీలు దొబ్బల భాస్కర్, బద్దీ రాజు, ఆమనగల్లు మండల అధ్యక్షుడు కొప్పు మహేష్, తలకొండపల్లి మండల ఉపాధ్యక్షుడు మహేష్, సీనియర్ నాయకులు బాలరాజుతో పాటు పెద్ద ఎత్తున గులాబీ తీర్థం పుచ్చుకున్నారు.

# పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ ప్రక్రియను చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 27(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ ప్రక్రియను చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేయడం, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిబంధనలు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సిబ్బందికి మొదటి విడుత శిక్షణ కార్యక్రమంలో ఫారం -12 అందించి పోస్టల్ బ్యాలెట్‌పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. 85 సంవత్సరాల వయస్సు పూర్తైన వారు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌వో సంగీత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

# నేడు పోలింగ్

**తుది దశకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రక్రియ**

**షాద్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు**

**ఓటు హక్కును వినియోగించుకోనున్న 171 మంది..**

**ఏప్రిల్ 2న ఫలితాలు**



కొడంగల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ వాణిప్రసాద్

షాద్‌నగర్, మార్చి 27 : ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నిక చివరి దశకు చేరుకున్నది. గురువారం పోలింగ్ ఉండడంతో షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారులు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ పక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలకు తరలించనుండగా.. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

### 171 మంది ఓటర్లు..

షాద్‌నగర్ పోలింగ్ కేంద్రంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఫరూఖ్‌నగర్, కొందుర్గు, కొత్తూరు, చౌదరిగూడ, నందిగామ, కేశంపేట, మాడ్గుల, కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో పాటు షాద్‌నగర్, కొత్తూరు, ఆమనగల్లు మున్సిపాలిటీల కౌన్సిలర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరితో పాటు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, బస్వరాజ్ సారయ్య, సత్యవతి రాథోడ్ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ కేంద్రం పరిధిలో మొత్తం 171 మంది ఓటర్లుండగా.. ఇందులో 94 మంది మహిళలు, 77 మంది పురుషులు ఉన్నారు.

### పోలింగ్ కేంద్రం పరిశీలన..

షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు, షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాపలింగం బుధవారం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించినవారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా ఓటర్లు, అభ్యర్థులు, నాయకులు సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీసులు తెలిపారు.

### బీఆర్‌ఎస్ పార్టీ ఓట్లే ఎక్కువ..

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 1,439 మంది ఓటర్లున్నారు. ఇందులో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు మొత్తం కలిపి 850 మంది ఉన్నారు. మెజార్టీ ఓటర్లు ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థి ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమనే చర్చ జరుగుతున్నది. మరోవైపు అధికార పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి సైతం గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందినవారు ఉండడంతో ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుచుకుంటామని ఆ పార్టీ నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. కొందరు నాయకులు ఓటర్లను గత కొన్ని రోజులుగా క్యాంపులో ఉంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.

### కొడంగల్‌లోనూ పోలింగ్ కేంద్రం..

కొడంగల్ : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలోనూ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలవారు 56 మంది ప్రజాప్రతినిధులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడే ఓటు హక్కు వినియోగించుకోనున్న దృష్ట్యా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు.






తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## చేవెళ్ల నుంచే..

# బీఆర్‌ఎస్ కదన భేరి

**ఏప్రిల్ 13న భారీ బహిరంగ సభకు నిర్ణయం**

**ఇప్పటికే సన్నాహక సమావేశాలతో శ్రేణుల్లో జోష్**

రంగారెడ్డి, మార్చి 27(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సిద్ధమవుతున్నారు. షెడ్యూల్ విడుదల కాక ముందే కరీంనగర్‌లో బహిరంగ సభ నిర్వహించి ఎన్నికల శంఖారావాన్ని పూరించిన ఆయన.. ఏప్రిల్ 13న చేవెళ్ల నుంచి ఎన్నికల కదన భేరిని మోగించబోతున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ముందుకు సాగుతున్నది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు దఫాలుగా కేసీఆర్‌తోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ స్థాయిల్లో సన్నాహక సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాజీ ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే నెల 13న చేవెళ్ల నియోజకవర్గంలో కేసీఆర్‌తో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించడం పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపుతున్నది.

**షెడ్యూల్‌కు ముందు నుంచే దూకుడుగా..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ.. గులాబీ దళాన్ని ఎన్నికలకు సన్నద్ధం చేసేలా.. బీఆర్‌ఎస్ పార్టీ షెడ్యూల్‌కు ముందు నుంచే లోక్‌సభ ఎన్నికల కసరత్తును ప్రారంభించింది. పార్టీ క్యాడర్‌లో జోష్ నింపి..రానున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ అగ్రనేతలు ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది జనవరిలోనే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన గెలుపు వ్యూహాలపై సమాలోచనలు చేశారు. అందరి నేతల ఏకాభిప్రాయం మేరకు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ పేరును ప్రకటించారు. అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన మరుసటి రోజు నుంచే నియోజకవర్గాలవారీగా నిర్వహిస్తున్న సమావేశాల్లో కాసాని పాల్గొనడమేకాకుండా ముఖ్య నేతలు, కార్యకర్తలను కలుస్తున్నారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఈ సమావేశాల్లో అన్నీతానై వ్యవహరిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లపై విమర్శనాస్త్రాలు సంధించి పొలిటికల్ హీట్‌ను పెంచుతూ.. మరోవైపు కార్యకర్తల్లో సమరోత్సాహాన్ని నింపుతున్నారు. కాసాని గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిస్తున్నారు. నేతలంతా ఒక్కతాటిపై నిలబడి సమన్వయంతో ముందుకు సాగుతుండడం పార్టీ శ్రేణుల్లోనూ ఉత్సాహాన్ని నింపుతున్నది.

## రంజిత్‌రెడ్డి స్వార్థపరుడు..

- అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ బీఆర్‌ఎస్‌ను వీడి ద్రోహం చేశారు
- విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ మారితే ఏం జరిగిందో అందరికీ తెలుసు
- సామాజిక సమీకరణాల దృష్ట్యా కాసాని గెలుపు సులభమే..
- చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అధికారం, ఆస్తుల కోసమే రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి బీఆర్‌ఎస్ పార్టీకి ద్రోహం చేశారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్‌ను వీడి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎంపీ రంజిత్‌రెడ్డిపై కేటీఆర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించుకున్న తర్వాతనే ఆయన ఎవరో ప్రపంచానికి తెలిసిందన్నారు. 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీలోని ప్రతి కార్యకర్త కష్టపడి రంజిత్‌రెడ్డిని గెలిపించారని గుర్తు చేశారు. పార్టీలో అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, నియోజకవర్గంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని.. అయినప్పటికీ కాంగ్రెస్‌లో చేరి ద్రోహం చేశారని విమర్శించారు. తన సోదరి అని చెప్పుకునే కవితను ఈడీ అరెస్టు చేసిన రోజే.. నవ్వుకుంటూ వెళ్లి కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడని రంజిత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రంజిత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ ఏం తక్కువ చేసిందని పార్టీని వీడారంటూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ చర్చించుకుంటున్నారన్నారు. గతంలో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొంది పార్టీ మారిన మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి పరిస్థితి ఏమైందో అందరికీ తెలుసునన్నారు. పార్టీ కన్నా తానే పెద్ద అనే అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి మిలాఖత్ అయినంత మాత్రాన.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసి పోతారనుకోవడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

**బీసీలకు అండగా నిలబడ్డ వ్యక్తి కాసాని..**

కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లతోపాటు బీసీల కోసం దశాబ్దాలుగా అండగా నిలబడిన గొప్ప వ్యక్తి అని కేటీఆర్ పొగిడారు. ఓవైపు బీసీల కోసం పాటుపడుతూనే మరోవైపు అన్ని సామాజిక వర్గాలను, మైనార్టీలను కలుపుకొనిపోయిన మంచి వ్యక్తి కాసాని అని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో తీవ్రమైన అయోమయం నెలకొన్నదని, చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీకి కనీసం అభ్యర్థి కూడా దొరకలేదన్నారు. సొంతంగా అభ్యర్థులు కరువైన కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో గెలవడం అసాధ్యమన్నారు. చేవెళ్లలో కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించి హ్యాట్రిక్ కొట్టాలని పిలుపునిచ్చారు. సామాజిక సమీకరణాల రీత్యా కాసాని గెలుపు సులభం అవుతుందన్న విశ్వాసాన్ని సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కేటీఆర్ వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. సమావేశంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీలు వాణీదేవి, ఎగ్గే మల్లేశం, బొగ్గారపు దయానంద్, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలెట్ రోహిత్ రెడ్డి, కొప్పుల మహేశ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెర్రలు తేలాయి

**రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలాలు**

**ఎండిపోతున్న వరిపంట..**

**వికారాబాద్ జిల్లాలోని కులకచర్ల, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో అత్యధికం**

**దాదాపు 20 వేల ఎకరాలకుపైనే ఎండుముఖం పట్టినట్లు అధికారుల అంచనా**

**రోజురోజుకూ తగ్గుతున్న బోర్లలోని నీటినిల్వలు**

**ఏప్రిల్‌లో బోర్లలోని నీటి నిల్వలు పూర్తిగా తగ్గితే 70 శాతానికిపైగా నష్టపోనున్న రైతాంగం**

**అప్పుల పాలు కానున్న రైతన్నలు.. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి**



బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్‌లో ఎండిన వరి పంట

వికారాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : యాసంగి రైతాంగానికి కష్టకాల మొచ్చింది. అన్నదాతలను అప్పులపాలు అవుతున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా భూగర్భజలాలు తగ్గడంతో వరి పంట ఎండిపోయింది. పంట పొలాలు నెర్రలు బారడంతో రైతన్న కండ్లల్లో కన్నీళ్లు తిరుగుతున్నయ్. జిల్లాలో దాదాపు 20వేల ఎకరాల్లో వరి పంట ఎండినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా కులకచర్ల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో ఎండిన పంటలను గుర్తించారు. రికార్డు స్థాయిలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. రోజురోజుకూ బోర్లలో నీటినిల్వలు తగ్గుతుండడంతో రైతాంగం ఆందోళనకు గురవుతున్నది. రానున్న ఏప్రిల్‌లో బోర్లలో నీటినిల్వలు పూర్తిగా తగ్గే ప్రమాదం ఉన్నది. ప్రస్తుతం 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతుండగా, ఏప్రిల్‌లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతకు మించి నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా. మరోవైపు ఎండిన పంటలను కొందరు రైతులు పశువులను మేపుతున్నారు. పెట్టిన పెట్టుబడి రాని పరిస్థితి.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**84 వేల ఎకరాల్లో వరి సాగు..**

యాసంగి సీజన్‌లో 84 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. అత్యధికంగా బొంరాస్‌పేట మండలంలో 12,175 ఎకరాలు, దౌల్తాబాద్‌లో 11,883, దోమలో 11,769, యాలాలలో 10,903, కొడంగల్‌లో 7202, కులకచర్లలో 5686, పరిగిలో 5162, తాండూరులో 4962, ధారూరులో 4547, బషీరాబాద్‌లో 3991, పెద్దేముల్‌లో 3097, చౌడాపూర్ మండలంలో 2485 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. అయితే ఇప్పటి వరకు సాగైన వరి పంటలో సుమారు 20 వేల ఎకరాల వరకు ఎండినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో మెజార్టీ భాగం బోర్లపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఏప్రిల్ రెండో వారం వరకు బోర్లలో నీటి నిల్వలు తగ్గకుంటే వరి పంట చేతికొచ్చే అవకాశాలున్నాయి. లేదంటే సాగు చేసిన దానిలో 70 శాతానికిపైగా నష్టపోయే ప్రమాదమున్నది.

**13.07 మీటర్లకు అడుగంటిన భూగర్భ జలాలు..**

జిల్లాలో భూగర్భజలాలు ప్రస్తుతం 13.07 మీటర్ల లోతుకు అడుగంటిపోయాయి. గతేడాది జనవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి 11.16 మీటర్ల మేర నీటి నిల్వలుండగా, కొన్ని రోజుల్లోనే రెండు మీటర్ల మేర తగ్గాయి. రానున్న ఏప్రిల్, మే నెల వరకు ప్రమాదకర స్థాయిలో భూగర్భ జలాలు తగ్గే ప్రమాదం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని మెజార్టీ చెరువుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి. బొంరాస్‌పేట మండలంలోని గౌరారం, పరిగి మండలంలోని నస్కల్, రంగంపల్లి గ్రామాల్లో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోవడం గమనార్హం. పెద్దేముల్ మండలంలోని నాగులపల్లిలో 32.28 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. దోమ మండలంలోని దిర్సంపల్లిలో 31.20 మీటర్లకు, మర్పల్లి మండలంలోని నర్సాపూర్‌లో 28.97 మీటర్లకు, దర్గుపల్లిలో 22 మీటర్లకు, నవాబుపేట మండలంలోని మాదిరెడ్డిపల్లిలో 23.30 మీటర్లకు, బొంరాస్‌పేట మండలంలోని అంసన్‌పల్లిలో 29.22 మీటర్లకు, బూరాన్‌పూర్‌లో 25.95 మీటర్లకు, తాండూరు మండలంలోని జిన్‌గుర్తిలో 24.12 మీటర్లకు, యాలాల మండలంలోని దేవనూరులో 26.52 మీటర్లకు భూగర్భజలాలు అడుగంటిపోయాయి.



### భూగర్భ జలాలు అడుగంటి పోయాయి..

భూగర్భజలాలు అడుగంటి పోయి పంటలు ఎండిపోయాయి. రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. రూ.40వేలు పెట్టిన. బోర్ల నీళ్లు లేవు. దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నా. పంటంతా పశువులకు మేతైంది. రోజూ పశువులను మేపుతున్నా. గత 10ఏండ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– బంకింటి గోపాల్‌రెడ్డి, రైతు పుట్టపహాడ్, కులకచర్ల మండలం

### వరి పంట ఎండింది..

వరి పంట ఎండి పోయింది. పశువుల మేపుకునే పరిస్థితి వచ్చింది. వానలు లేక బోర్లలో నీళ్లు గుంజుకుపోయినయ్. పెట్టుబడికి అప్పులు తెచ్చి పెట్టిన. ఎండిన పంటను చూస్తే దుఃఖమొస్తుంది. రెక్కల కష్టం ఆవిరైపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నా.

– మన్నె నర్సింహులు, సాల్వీడ్ కులకచర్ల మండలం





పుట్టపహాడ్‌లో ఎండిన వరి పంటను పశువులతో మేపుతున్న రైతు